సాక్షి మంచిర్యాల

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



జీవన వైవిధ్యం.. ప్రాణహితం

మదిని మైమరిపించే ప్రకృతి అందాలు.. జన జీవనానికి ఉపాధి నిచ్చే అవకాశాలు.. జీవాలకు ప్రాణం పోసే వనరులు.. ఇవన్నీ కలిసిన ప్రాంతం ప్రాణహిత నదీ తీరం. 8లో▸



కంపుకొడుతున్నయ్

జిల్లాలో ఏటా పట్టణ జనాభా పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో పారిశుధ్యం మెరుగుపడటం లేదు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.1 /19.3

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మంచిర్యాల మున్సిపల్ సమావేశం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ తెలిపారు. రెండు నెలలుగా మున్సిపల్ సమావేశం నిర్వహించకపోవడంతో, పలు అభివృద్ధి పనుల తీర్మానాలు జరగడం లేదని తెలిపారు. వచ్చే నెలలో పదవీకాలం ముగుస్తుండడంతో ఈ నెలలోనే సమావేశం నిర్వహించాలని పాలకవర్గ సభ్యులు కోరారు. దీంతో సమావేశం ఏర్పాటు చేశారు.

మాజీ ప్రధానికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభను టీఎన్జీవోస్ భవన్‌లోఆదివారం నిర్వహించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియా రం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్ పాల్గొని మాజీ ప్రధానికి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన ఆర్థిక సంస్కరణలతోనే దేశం పటిష్టంగా ఉందన్నారు. యూనియన్ కేంద్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు బాపురావు, కోశాధికారి సతీశ్, జిల్లా ఉపాధ్యక్షులు కేజియా రాణి, రాంకుమార్, జాయింట్ సెక్రెటరీ సునీత, ప్రభు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, ఉపాధ్యక్షుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీ యూనిట్-1లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

జైపూర్: జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్-1 (600మెగావాట్స్‌లో) ఆదివారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రధానమైన బాయిలర్ ట్యూబ్‌లో లీకేజీ కారణంగా ఉత్పత్తి నిలిపివేశారు. అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు.

'ఓపెన్' తరగతుల పరిశీలన



రికార్డులు తనిఖీ చేస్తున్న శ్రీనివాసరావు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతులను ఓపెన్ స్కూల్ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అభ్యాసకులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై టీచర్లు ఇచ్చే అసైన్‌మెంట్స్ సాధన చేయాలని సూచించారు. ఏప్రిల్ 2025లో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు ఈనెల 30 వరకు అడ్మిషన్ పొందాలని సూచించారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ అశోక్, పాఠశాల అసిస్టెంట్ కోఆర్డినేటర్ రేణిరాజయ్య ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి: సెలవు రోజుల్లో నిర్వహించే ఓపెన్ తరగతులను అభ్యాసకులు సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్స్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ నాగుల అశోక్ అన్నారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. అభ్యాసకులతో మాట్లాడారు. వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిదని సూచించారు. అడ్మిషన్లకు ఈ నెల 30 వరకు గడువు ఉందని చెప్పారు. దండేపల్లి ఓపెన్ స్కూల్ సహాయ కోఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు చెటుపల్లి రమేశ్, కొండు జనార్దన్, రామన్న పాల్గొన్నారు.

ఎస్ఎస్‌ఏల వినూత్న నిరసన



రాఖీలు కడుతున్న మహిళా ఉద్యోగులు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమ్మెలో భాగంగా 21 రోజు ఆదివారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. పురుషులు సీఎం రేవంత్‌రెడ్డి మాస్కులు ధరించగా, మహిళా ఉద్యోగులు వారికి రాఖీలు కట్టారు. జేఏసీ అధ్యక్షురాలు సుమలత మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిని తమ సోదరుడిగా భావిస్తున్నామని, సమస్యలు పరిష్కరించాలని రాఖీలు కట్టామని తెలిపారు. ఎస్ఎస్‌ఏల సమ్మెకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మద్దతు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైద్యం మెరుగు..



నవంబర్ 21న మాతా శిశు, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

- మాతా శిశు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- క్రిటికల్ కేర్ ఏర్పాటుకు భూమి పూజ
- నూతన నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులు ప్రారంభం
- ప్రారంభమైన పారా మెడికల్ కోర్సులు

మంచిర్యాలటౌన్: జిల్లాలో ప్రభుత్వ వైద్యం గతంతో పోలిస్తే ఈ ఏడాది వైద్యం మెరుగుపడగా, భవిష్యత్తులో పూర్తిస్థాయి వైద్య సేవలు ప్రజలందరికీ ఉచితంగా నాణ్యతతో అందించేందుకు అడుగులు పడ్డాయి. ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణ లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అన్నిరకాల వసతులతో కూడిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు సైతం హాజీపూర్ మండలం గుడిపేట్‌లో సాగుతున్నాయి. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, పనులన్నీ పూర్తి చేసుకుని త్వరలోనే సొంత భవనంలోకి మారి, నర్సింగ్ విద్యార్థినులకు అన్ని రకాల వసతులతో కూడిన భవనం అందుబాటులోకి రానుంది. ఐబీ ఆవరణలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు నవంబర్‌లో ప్రారంభించగా, ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో 17 పీహెచ్‌సీలు, 4 అర్బన్ హెల్త్ సెంటర్లు, 3 బస్తీ దవాఖానాలు, 3 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉండగా, అన్ని ఆస్పత్రులకు మెడికల్ ఆఫీసర్లను కేటాయించారు. వైద్యుల కొరత జిల్లాలో ఉండగా, అవసరమైన వైద్యులను ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేస్తున్నారు.

అన్ని వసతులతో నిర్మాణాలు..

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) నూతన భవన నిర్మాణ పనులు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలో జీ+3తో నాలుగు బ్లాకులుగా నిర్మిస్తున్నారు. పాతభవనంలో ఏటా వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటూ రోగులు, వైద్యులు, వైద్య సిబ్బంది గడుపుతున్నారు. స్లాబ్ పెచ్చులు ఊడుతోంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి తరుచూ వైర్లు కాలిపోతున్నాయి. దీనికితోడుగా వార్డులు, గదుల కొరతతో అన్ని రకాల వైద్య సేవలు ప్రస్తుతం ఉన్న జీజీహెచ్‌లో అందించలేక పోతున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలో జీ+3 నాలుగు బ్లాకులుగా



నిర్మాణంలో ఉన్న మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

నిర్మిస్తున్నారు.

- మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సొంత భవనం హాజీ పూర్ మండలం గు డిపేట్‌లో నిర్మిస్తున్నా రు. ఇక్కడ మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు, బాలురు, బాలికల వసతి గృహాలు, ప్రిన్సిపా ల్, స్టాఫ్ క్వార్టర్లను నిర్మిస్తున్నారు. దాదాపుగా నిర్మాణ పనులు పూర్తికానుండగా, వచ్చే ఏడా ది నుంచి తరగతులు నూతన భవనంలోనే కొనసాగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి భవన నిర్మాణా లకు గాను రూ. 350 కోట్ల నిధులను కేటాయించారు.
- రూ.300 కోట్లతో జిల్లా కేంద్రంలోని ఐబీ ఆవరణలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి నవంబర్ 21వ తేదీన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ శంకుస్థాపన చేయగా, మొదటి విడతలో విడుదలైన రూ.50 కోట్లతో ప్రారంభించిన పనులు శరవేగంగా చేపడుతుండగా, రెండేళ్లలోపు ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలను తీసుకుంటున్నారు.
- రూ.40 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను సాయికుంటలో ప్రారంభించి, చేపట్టనుండగా సొంత భవనం ఏడాదిన్నరలో అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులు చేపడుతున్నారు. కళాశాల నిర్మాణంతోపాటు, వసతి గృహ భవనాల నిర్మాణం చేపడుతున్నారు. 2022లో మంచిర్యాలలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు.
- ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలో 50 పడకలతో క్రిటికల్ కేర్ సెంటర్ పనులకు శంకుస్థాపన చేశారు.

కాలం గిర్రున తిరిగింది. మరో రెండు రోజుల్లో 2024 కాలగర్భంలో కలవనుంది. ఈ ఏడాది మంచి, చెడుల జ్ఞాపకంగా మిగలనుంది. ఇక జిల్లా ఈ ఏడాది వైద్యంలో కాస్త మెరుగు పడగా, విద్యలో మాత్రం ఒడిదుడుకులు కొనసాగుతున్నాయి. 2024లో విద్య, వైద్య రంగాల్లో సాధించిన ప్రగతిపై రివైండ్ స్టోరీ.

రివైండ్ 2024

విద్య, వైద్యం

వైద్య సేవలను మెరుగుపర్చేలా...

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఆశ కార్యకర్తలు పనిచేస్తుండగా, ఒక్క మంచిర్యాల పట్టణంలో మాత్రమే ఆశాలు లేరు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చేపట్టే ఆరోగ్య కార్యక్రమాలను అంగన్‌వాడీ టీచర్ల సహాయంతోనే వైద్యాధికారులు చేపడుతున్నారు. ఈ ఏడాది మంచిర్యాల పట్టణానికి అవసరమైన ఆశ కార్యకర్తలను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దండేపల్లి మండలం వెంకట్రావ్‌పేట్, చెన్నూరు మండలం అంగ్రాజ్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను త్వరలోనే రెండు ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

- ఈ ఏడాది నుంచి మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారా మెడికల్ కోర్సులు ప్రారంభించారు. డీఎంఎల్‌టీ (డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్)లో 30 సీట్లు, డీఎంఎస్‌టీ(డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్)లో 30 సీట్లతో పారా మెడికల్ కోర్సును నూతనంగా ప్రారంభించారు.
- మంచిర్యాల జిల్లాగా ఏర్పడిన నాటి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగానే సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు నవంబర్ వరకు మందులు సరఫరా చేశారు. సరిపడా మందులు జిల్లాకు చేరక పోవడంతో, డ్రగ్‌స్టోర్‌ను మంచిర్యాలలోనే ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉండగా, నవంబర్ నుంచి మంచిర్యాలలోనే డ్రగ్ స్టోర్‌ను ఏర్పాటు చేసి, అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు మందులను సరఫరా చేస్తున్నారు.
- జిల్లాలో అత్యవసర సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ ఏడాది నూతనంగా 108, 102 వాహనాలను జిల్లాకు కేటాయించారు. జిల్లాలోని 18 మండలాలకు 14 వాహనాలు అందుబాటులో ఉండగా, ఈ నెలలోనే నూతనంగా 108 వాహనాలను 3 తీసుకురాగా, 102 వాహనాలు సైతం మూడు జిల్లాకు అందించారు. అన్ని మండలాలకు వాహనాల కొరత ఈ ఏడాది తీరింది.
- జిల్లాలో క్యాన్సర్ బాధితులు పెరుగుతుండడంతో రాష్ట్రవ్యాప్తంగా 10 క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండగా, అందులో మంచిర్యాల జిల్లాకు ఒకటి కేటాయిస్తున్నట్లు ఇటీవల ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ప్రకటించడంతో, జిల్లాలోని క్యాన్సర్ బాధితులకు ఊరట లభించనుంది.
- హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులను గుర్తించడంతోపాటు, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో యాంటి రెట్రోవైరల్ థెరపీ(ఏఆర్‌టీ) కేంద్రాలను ఏర్పాటు చేయాలని జాతీయ వైద్య కమిషన్ ఈ ఏడాది ఆదేశాలను జారీచేసింది. దీంతో మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా త్వరలోనే ఏఆర్‌టీ కేంద్రం ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

విద్య.. ఒడిదుడుకులు



డైనింగ్‌హాల్ లేక నేలపై కూర్చుని భోజనం చేస్తున్న విద్యార్థులు

- నిలిచిన 'మనఊరు–మనబడి'
- ఉపాధ్యాయుల బదిలీ
- డీఎస్సీతో నియామకాలు

మంచిర్యాలఅర్బన్: ఈ ఏడాది విద్యారంగం జిల్లాలో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంది. మన ఊరు–మనబడి పనుల్లో ప్రతిష్టంభన నెలకొనగా.. అమ్మ ఆదర్శ కమిటీ పనులు కొనసాగు..తూనే ఉన్నాయి. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సాఫీగా పూర్తికాగా .. 317 జీవో బదిలీలకు మోక్షం లభించలేదు. స్పౌజ్, హెల్త్, మ్యూచవల్ ట్రాన్స్‌ఫర్లకు అనుమతి ఇచ్చినా ఎటూ తెల్చకపోవడంతో నిరాశ నింపింది. పాఠశాలల్లో ఇదివరకు విధులు నిర్వహించే టీచర్ల బదిలీలు, పదోన్నతులతో సంబురా ల్లో మునిగితేలగా.. డీఎస్సీతో కొత్త నియామకాలు పొంది నిరుద్యోగుల్లో ఆనందం నింపింది. రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయంతో మండలానికి ఒక విద్యాధికారిని నియమించింది. సర్కారు పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందించడానికి సమావేశాలు నిర్వహించారు. 2024 మార్చిలో నిర్వహించిన పదో తరగతి వార్షిక ఫలితాల్లో జిల్లా 91.54 శాతం సాధించింది. ముగ్గురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. పీఎంశ్రీ పథకంలో విద్యార్థులకు వరంగల్, హైదరాబాద్, బాసర చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం లభించింది. రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతీ మండలానికి ఒకటి చొప్పున రూ.5 లక్షలతో మోడల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా నియమించి పారిశుధ్య కార్మికుల నిధులు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. విద్యాశాఖలో కీలకంగా వ్యవహరిస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణ, సమానపనికి సమాన వేతనం కోసం చేపట్టిన సమ్మె (21వ రోజు) కొనసాగుతుండడంతో విద్యాబోధనపై ప్రభావం చూపుతోంది. భవిత కేంద్రాలకు తాళాలు పడటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

పాత పనులపై ప్రతిష్టంభన, సాగు...తున్న కొత్త పనులు..

మన ఊరు–మనబడిలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తిగా నిలిచిపోయాయి. 245 బడుల్లో పనులకు కలెక్టర్ ఆమోదం లభించింది. 211 పనులు రూ.30 లక్షలలోపు, ఆపైన చేపట్టిన పనులు నిధుల్లేక పూర్తిగా నిలిచిపోయాయి. పాత పనులు సాగక.. కొత్త పనుల్లో చేర్చకపోవడంతో మనఊరు–మనబడిలో ఎంపికై నా పాఠశాలల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. ఇదివరకు పనులు ప్రారంభించిన బడులు మినహా మిగిలిన పాఠశాలల్లో రూ.18,96,76,000తో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

- మార్చి6న ఉత్తరఖండ్ రాష్ట్రంలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు తీరు, విద్యార్థుల అభ్యసన ఫలితాలు, ఉపాధ్యాయులు అవలంబిస్తున్న వినూత్న బోధన పద్ధతుల పరిశీలనకు జిల్లా ఉపాధ్యాయ బృందం వెళ్లింది.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరికరాలు, రసాయనాల కొనుగోలుకు రూ.25 వేలు, సీసీ కెమెరాలకు రూ.6 వేలు కళాశాలల బ్యాంకు ఖాతాలో జమయ్యాయి.
- ఈనెల 14న గురుకులాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాల్లో లాంఛనంగా ప్రారంభించిన కామన్ డైట్ మెనూపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. గురుకులాలు మినహాయిస్తే మిగిలిన వసతిగృహాల్లో పాత మెనూ అమలు చేస్తున్నారు.

'ఖజానా గండి' కథ కంచికేనా..?

- ఎన్నికల హామీలకే పరిమితమైన ప్రాజెక్టు
- ఆవిరవుతున్న రైతుల ఆశలు
- మట్టి తవ్వకాలతో చారిత్రక కట్ట కనుమరుగు



తాజాగా ఖజానా గండి కట్ట ప్రాంతంలో మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

తాండూర్: 'ఖజానా గండి'.. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఈ పేరు తెలియని, విననివారు ఉండరు. అనడంలో అతిశయోక్తి లేదు. తాండూర్ మండలంతోపాటు చుట్టుపక్కల వారికి ఈ ప్రాంతం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అంతటి ఖ్యాతి గడించిన ఖజానా గండి ప్రాజెక్టు ఏళ్ల గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా ఖజానా గండి కథ ముందుకు సాగ డం లేదు. ఈ పరిణామాలు ఈ ప్రాంత రైతులను నిరాశకు గురిచేస్తున్నాయి. ఖజానా గండి కథ కంచికి చేరనుందా...? అన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఎప్పటికై నా ఖజానా గండి ప్రాజెక్టు పూర్తవుతుంది.. సాగునీటి సమస్య తీరి వందల ఎకరాలకు సాగునీరు అందుతుందన్న రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి.

చారిత్రక ప్రాంతం..

మండలంలోని పోచంపల్లి, మాదారం త్రీఇంక్లైన్ గ్రామాల మధ్యలోని ఖజానా గండి ప్రాంతం చారిత్రక ప్రదేశం. పూర్తిగా బండరాళ్ల మధ్యలో ఉన్న ఈ కాల్వకు శతాబ్దాల చరిత్ర ఉంది. 16, 17 శతా బ్దాల కాలంలో తాండూర్‌ను కేంద్రంగా చేసుకుని పరిపాలన సాగించిన గోండు రాజుల హయాంలో ఈ ఖజానా గండి వెలుగులోకి వచ్చింది. ఆసమయంలో ఈ ప్రాంతంలో పెద్దకట్ట ఏర్పాటు చేసి నీటిని నిల్వఉంచి మండలంలోని తొమ్మిది ప్రధాన చెరువులకు గొలుసుకట్టు విధానంలో నీటిని సరఫరా



ఖజానా గండిని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

చేసేవారు. మండలాన్ని సస్యశ్యామలంగా మార్చేందుకు ఈ ఖజానా గండి ప్రాజెక్టు నిర్మించాలని మండల వాసులు కోరుతున్నారు.

హామీలకే పరిమితం....

ఖజానా గండి ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణం హామీలకే పరిమితమవుతోంది. ఎన్నికల సమయంలో తమను గెలిపిస్తే ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇస్తున్నారు. గెలిచాక మర్చిపోతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు ప్రాజెక్టు నిర్మాణం కోసం పలుమార్లు ప్రతిపాదనలు చేసినా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. కొన్నిసార్లు సర్వేలు జరిగినా కార్యరూపం దాల్చలేదు. అటవీశాఖ అనుమతులు, సాంకేతిక సమస్యలు, ఓపెన్‌కాస్ట్ ఏర్పాటు సాకుగా చూపుతూ ఆ ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలయ్యాయి.

మట్టితవ్వకాలకు అనుమతి..

తాజాగా ఈ ప్రాంతంలో మట్టి తవ్వకాలకు అనుమతులు రావడంతో ఈ చారిత్రక ప్రదేశం కనుమరుగు కానుంది. ఖజానా గండి ప్రాంతంలో పోచంపల్లి గ్రామ రైతులకు గతంలో పట్టాలు జారీ అయ్యాయి. దీంతో కొందరు మట్టి తవ్వకాల కోసం అనుమతులు తెచ్చుకుని ఖజానా గండి కట్ట ప్రాంతంలో తవ్వకాలు చేపడుతున్నారు. ఇప్పటికే టన్నుల కొద్దీ మట్టి తరలిపోవడంతో ఖజానా గండి కట్ట ఆనవాళ్లు కోల్పోతోంది. అయినా అధికారులు, నేతలు ఎవరూ నోరు మెదపడం లేదు. చరిత్ర కాల గర్భంలోకి కలిసిపోకముందే స్థానికులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు స్పందించి పూర్వవైభవం తెచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. సీసీసీ కార్నర్‌లోని నర్సయ్య భవన్‌లో శ్రీరాంపూర్ ఏరియా అన్ని గనుల ఫిట్ కమిటీ, మైన్స్ కమిటీ, ట్రేడ్స్‌మెన్స్, మైనింగ్ స్టాఫ్ ఇతర కమిటీ నేతల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా సీతారామయ్య హాజరై మాట్లాడారు. హామీల అమలులో భాగంగా ఇటీవల డైరెక్టర్ (పా)స్థాయిలో జరిగిన స్ట్రక్చరల్ సమావేశంలో పలు డిమాండ్లు పరిష్కరించామన్నారు. త్వరలో జరిగే సీఎండీస్థాయి సమావేశంలో కూడా ఇతర హామీలపై చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. కొత్త గనులు వస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందన్నారు. కొత్త గనుల ఏర్పాటు కోసం ఏఐటీయూసీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి ఉన్న రూ.33 వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో ప్రతీ హక్కు వెనుక ఏఐటీయూసీ పోరాటం ఉందన్నారు. ఎంతో మంది అమరుల త్యాగాలతో నేడు సింగరేణి కార్మికులు అనేక సదుపాయాలు పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, కేంద్ర కార్యదర్శి అక్బల్‌అలీ, బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, యూనియన్ నాయకులు ప్రసాద్‌రెడ్డి, సుధాకర్, బాలకృష్ణ, చంద్రశేఖర్, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

మీడియా కార్యదర్శిగా రాజ్‌కుమార్



ఏఐటీయూసీ శ్రీరాంపూర్ మీడియా కార్యదర్శిగా ఆర్కే–7 గనికి చెందిన జాడి రాజ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య నియామకాన్ని ఖరారు చేశారు. ఈ సందర్భంగా మీడియా లోగోను కూడా ఆవిష్కరించారు.

బ్యాట్ పట్టి.. పోటీలను ప్రారంభించి..

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీగ్రౌండ్‌లో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అటల్ బిహారి వాజ్‌పేయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటును బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తర్వాత బ్యాటింగ్ చేసి రఘునాథ్ పోటీలను ప్రారంభించారు. గెలుపోటములను సమానంగా తీసుకుంటూ, విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రఘునాథ్

శ్రీవారి సేవలో చెన్నూర్ ఉపాధ్యాయులు

చెన్నూర్: చెన్నూర్ మండలంలో విధులు నిర్వహిస్తున్న 16 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తిరుమల తిరుపతి దేవస్థానంలో సేవ పాల్గొన్నారు. పదేళ్లుగా ఏటా డిసెంబర్, మే నెలల్లో వారం రోజులు శ్రీవారి సేవకు తరలివెళ్తున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులు చక్రధర్, నరహరి అంజన్‌కుమార్, దుద్దిళ్ల శంకర్, కొమ్మెర రాజేశ్వర్, రాపర్తి శ్యాంసుందర్, గౌతం అశోక్, కొడిపల్లి బానయ్య, బాపురెడ్డి, శ్రీనివాస్, కొమట్ల బాపు, భిక్షపతి, కృష్ణమూర్తి, నలమాసు శ్రీనివాస్ ఏటా స్వామివారి సేవకు తరలివెళ్తున్నారు. వారంపాటు సేవలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు.



శ్రీవారి సేవలో పాల్గొన్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

ప్రపంచ తెలుగు మహాసభల్లో మనోళ్లు



ప్రశంసాపత్రం, మెమొంటోతో రాజమల్లు



ప్రశంసాపత్రం, మెమొంటోతో మహేందర్

చెన్నూర్: విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన ఆరో ప్రపంచ తెలుగు మహాసభల్లో మంచిర్యాల జిల్లా చెన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు, రచయిత దబ్బెట రాజమల్లు, మంచిర్యాల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు బొడ్డు మహేందర్ ప్రతిభ కనబర్చారు. సాహితీ సదస్సులో పాల్గొని తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజమల్లు, మహేందర్‌ను ప్రశంసా పత్రాలతో పాటు మెమొంటోలతో సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్: సీఎం కప్ జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి సీఎం కప్ తైక్వాండో ఎంపిక పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జిల్లా పేరును అగ్రభాగాన నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, తైక్వాండో జిల్లా ఇన్‌చార్జి అన్నారపు వీరేశ్, రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్ వెంకటస్వామి, సీనియర్ పీడీ హరిచరణ్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరు బలవన్మరణం



ఇందల్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: ఉరేసుకుని ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఆడె ఇందల్ (40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. శనివారం ఆదిలాబాద్‌లో చికిత్స చేయించుకున్నాడు. రాత్రి కావడంతో ఉట్నూర్‌లో ఉన్న తన సోదరుడు సంజీవ్ ఇంటికి వెళ్లాడు. నొప్పి అధికం కావడంతో భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య స్వాతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

లింగాపూర్: విషయం తెలుసుకున్న రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ మృతుని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించాడు.

జీవన వైవిధ్యం.. ప్రాణహితం

మదిని మైమరిపించే ప్రకృతి అందాలు.. జన జీవనానికి ఉపాధి నిచ్చే అవకాశాలు.. జీవాలకు ప్రాణం పోసే వనరులు.. ఇవన్నీ కలిసిన ప్రాంతం ప్రాణహిత నదీ తీరం. అబ్బురపరిచే అరుదైన దృశ్యాలకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం తలాయి గ్రామ సమీపంలోని ప్రాణహిత తీరం నిలయంగా ఉంది.

– చింతలమానెపల్లి/బెజ్జూర్

- సహజ సౌందర్యం
- జన జీవనోపాధికి నిలయం
- తలాయి వద్ద అరుదైన అందాలు
- పర్యాటక అభివృద్ధికి అవకాశాలు



కశ్మీర్ దాల్ లేక్ కాదు.. తలాయి తీరం



నదీ తీరంలో జీవనం సాగిస్తున్న కుటుంబం

సహజ సౌందర్యం..

ప్రాణహిత నది సహజ సౌందర్యానికి నిలయం. ఇరువైపులా దట్టమైన అటవీ ప్రాంతం. విశాలమైన ఇసుకమేటలు...తీరంలో మొక్కజొన్న చేలు.. నదిలో చేపల వేటకోసం పడవల్లో మత్స్యకారులు.. చేపల వేటకు వచ్చే పక్షుల సందడి..జలకళతో వంపులు తిరుగుతూ ప్రవహిస్తోంది ప్రాణహిత. తెల్ల ఇసుక మడుగుగా స్థానికులు పిలుచుకునే ఈప్రాంతంలో నది అందాలతో హొయలు పోతున్నట్లుగా కనిపిస్తుంది.

వివాదం.. పరిష్కారం.

తెలంగాణ, మహారాష్ట్రలకు ప్రాణహిత నది సరిహద్దుగా ఉంది. దీంతో తలాయి వద్ద ఇరు ప్రాంతాల ప్రజలకు వివాదం నెలకొంది. చేపలు పట్టడంపై ఇరు గ్రామాల ప్రజలు కొన్నేళ్ల క్రితం అభ్యంతరం తెలిపారు. కానీ ఈవివాదం ఇరు ప్రాంతాల పెద్దమనుషుల జోక్యంతో పరిష్కారమైంది. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమస్య పరిష్కారంతో ఇరు ప్రాంతాల ప్రజలు నదిలో చేపలు పట్టడం ద్వారా ఉపాధి పొందుతున్నారు.

పర్యాటక అభివృద్ధికి అవకాశాలు

అరుదైన సహజ సౌందర్యం ఉన్న తలాయి ప్రాంతం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ఇక్కడికి చేరుకోవడానికి రోడ్డు మార్గం ఉంది. ఈప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి కల్పించవచ్చు. ఇక్కడికి ఏటా వందల సంఖ్యలో ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. ప్రాణహిత నదికి మహారాష్ట్ర వైపు కమలాపూర్ ఏనుగుల సంరక్షణ కేంద్రం, వెంకటాపూర్ వెంకటేశ్వర ఆలయం, భామ్రాగడ్ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.

జీవనోపాధి..

నదులు నాగరికతకు నిలయాలు. నదుల్లోని వనరులను వినియోగించుకుని మనిషి తరాలుగా లబ్ధిపొందుతున్నాడు. తలాయి వద్ద ప్రాణహిత నదిలో చేపలు పట్టడం ద్వారా 150కు పైగా కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. తలాయి గ్రామం నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరం నీటిమట్టం ఏకాలంలోనూ అడుగంటదు. మహారాష్ట్ర వైపు దేవలమర్రి, తలాయి, సమీప గ్రామాల్లోని ప్రజలు ఎనిమిది నెలల పాటు నదిపై ఆధారపడి జీవిస్తారు. దీనికోసం నదీ తీరంలోని ఇసుకలో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు. పిల్లా పాపలతో ఇక్కడే నివాసం ఉంటారు. నేటికీ సంప్రదాయ పద్ధతులైన నాటుపడవలు, వలల ద్వారా చేపలు పట్టడం విశేషం. ప్రాణహిత నదిలో దొరికే చేపలకు స్థానిక మార్కెట్‌లో డిమాండ్ ఉంది.



నదిలో చేపలు పడుతున్న దంపతులు

చేపల వేటతో ఉపాధి



మహారాష్ట్ర వైపు ఉన్న దేవలమర్రి, తెలంగాణలోని తలాయి గ్రామానికి చెందిన ప్రజలు ఇక్కడ చేపలు పట్టుకుని జీవనోపాధి పొందుతున్నాం. గతంలో ఈప్రాంతంలో వివాదం ఉన్నా ఇరు ప్రాంతాల పెద్దమనుషులు సమస్య పరిష్కరించారు. ఎలాంటి వివాదాలు లేకుండా జీవనోపాధి పొందుతున్నాం.– పాఠెం భీమన్న, తలాయి

కుటుంబమంతా ఇక్కడే..



వర్షాకాలం ముగిసిందంటే నదీ తీరానికి వస్తాం. నా భార్య, కొడుకు, కోడలు ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకుంటాం. నెలల తరబడి నదిలోనే జీవనం సాగుతుంది. వర్షాకాలంలో పంటలు వేసే సమయంలో తిరిగి ఊళ్లకు పోతాం. ఉపాధినిచ్చే ప్రాణహితను అదృష్టంలా భావిస్తాం.

– పాఠెం శంకర్, తలాయి

పూర్వీకుల నుంచి..



మా కుటుంబాల్లో ఎక్కువ మందికి భూములు లేవు. ఇప్పుడిప్పుడే కొంత మంది ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నా ఎక్కువ మంది నదిపై ఆధారపడి జీవిస్తున్నాం. మాతాతలు ఇక్కడే బతికారు. మేంకూడా ఇక్కడే బతుకుతున్నాం.

– తోకల చిన్నన్న, దేవలమర్రి

ఇసుక లారీకి రూ.80వేల జరిమానా

తాంసి(బోథ్): భీంపూర్ మండలంలోని తాంసి(కె) శివారులో పెన్‌గంగ నది నుంచి మహారాష్ట్రకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఈ నెల 22న పిప్పల్‌కోటి వద్ద భీంపూర్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. లారీని స్టేషన్‌కు తరలించి పోలీసులు తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్‌శాఖ అధికారులకు లేఖ రాశారు. శనివారం సాయంత్రం జిల్లా మైనింగ్‌శాఖ అధికారులు ఇసుక విలువ అంచనా వేశారు. మైనింగ్‌శాఖ జిల్లా ఏడీ ఆర్.రవీందర్ లారీకి రూ.80వేల జరిమానా విధించినట్లు భీంపూర్ ఎస్సై కలీం ఆదివారం తెలిపారు. పెన్‌గంగ నుంచి ఇసుక తరలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

కలప పట్టివేత



ఇచ్చోడలో పట్టుకున్న కలప, బైక్‌లు

ఇచ్చోడ(బోథ్): మండలంలోని హరినాయక్ తండా వద్ద ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ రేంజి అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సిరిచెల్మ నుంచి ఇచ్చోడ వైపునకు వస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలప విలువ సుమారు రూ.27 వేలు ఉంటుందన్నారు. నిందితులు పరారీలో ఉన్నారని, కలపతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో అటవీశాఖ సిబ్బంది సజన్ లాల్, విశ్వజిత్, నాసిలాల్, శివచరణ్, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట అటవీ రేంజ్ పరిధిలోని నాగసముద్రం సమీపంలో రూ.5,649 విలువైన రెండు టేకు దుంగలను పట్టుకున్నట్లు డీఆర్వో సాగరిక తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కలప దుంగలు పట్టుకెళ్తున్న ఓ వ్యక్తిని వెంబడించడంతో పడేసి పారిపోయాడు. వాటిని తాళ్లపేట రేంజికి తరలించామని డీఆర్వో పేర్కొన్నారు. పట్టుకున్న వారిలో ఎఫ్‌బీవో రహీమొద్దీన్, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా జాతీయ యోగా, కరాటే పోటీలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో జాతీయస్థాయి యోగా, కరాటే చాంపియన్‌షిప్ 2024–25 పోటీలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. పట్టణంలోని పద్మశాలీ భవన్, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్, కరాటే అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఎనగందుల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ జె.శ్వేత, వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్ ప్రారంభించారు. తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి దాదాపు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడారు. వ్యక్తిగత ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మ విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. యోగాను జీవితంలో భాగంగా చేసుకుంటే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. గెలుపు ఓటములను సమానంగా చూడాలని సూచించారు.



యోగాసనాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

అలరించిన విన్యాసాలు..

క్రీడాపోటీలకు ముందు చిన్నారులు యోగా, కరాటే విన్యాసాలు ప్రదర్శించారు. ఎంతో నేర్పుతో కరాటేను ప్రదర్శించడం ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కరాటే, యోగా క్రీడాకారులు పోటాపోటీగా విన్యాసాలు చేసి అబ్బురపరిచారు. కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మున్సిపల్ కౌన్సిలర్ బండి ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడు మేడి పున్నంచందు, కరాటే మాస్టర్లు తగరపు శంకర్, ఎం.రాజేశ్, విజ్జగిరి రవి, నారాయణ, శిరీష పాల్గొన్నారు.

ఆర్పీల పోరుబాట

- నేడు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సమావేశం
- ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లనున్న మెప్మా రిసోర్స్ పర్సన్లు
- ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ల నుంచి ముందస్తు అనుమతి..

మంచిర్యాలటౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో పనిచేస్తున్న ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లు పోరుబాట పట్టనున్నారు. ప్రభుత్వ పరంగా నిధులు కేటాయించాలని, గౌరవ వేతనాలు పెంచాలని, పీఆర్సీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సోమవారం జరిగే తెలంగాణ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆర్పీల సంక్షేమ సంఘం సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఆర్పీలు సిద్ధమయ్యారు. సోమవారం మూకుమ్మడిగా హైదరాబాద్‌లో జరిగే యూనియన్ సమావేశానికి వెళ్లేందుకు శనివారం రోజే మున్సిపల్ కమిషనర్ల అనుమతి తీసుకున్నారు. ఈమేరకు అందరికీ సెలవు ఇవ్వాలని వినతిపత్రాలు అందించారు. మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ, వారిలో ఆర్థిక పురోగతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నా, ప్రభుత్వానికి అవసరమైన అన్ని రకాల సర్వేలు, కార్యక్రమాలను నిర్వహణలో పాలుపంచుకుంటున్నా, ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నా ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించడం లేదని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకన్నా ఎక్కువగా బరువు బాధ్యతలను మోస్తున్నా తమకు తగిన గుర్తింపు, శ్రమకు తగిన ఫలితం రావడం లేదని పేర్కొన్నారు. అధికారులు సైతం తమకు ఎలాంటి సంబంధం లేని పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

ప్రధాన డిమాండ్లు ఇవే..

- జీవో 164 ప్రకారం వీఎల్ఆర్ స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుంచి ఆర్పీలకు గౌరవ వేతనాలను ఇవ్వాలనే నిబంధన తొలగించి, సెర్ప్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వీవోఏల మాదిరిగా ప్రభుత్వపరంగా ప్రత్యేక నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇవ్వాలి.
- గత ప్రభుత్వం అన్నిరంగాల వారికి 30 శాతం పీఆర్సీ అమలు చేసి ఆర్పీలకు మాత్రమే ఇవ్వలేని, పీఆర్సీ అమలు చేయాలి.
- ఆర్పీలకు కనీస వేతనం రూ.20 వేలు ఉండాలి.
- ఆర్పీలందరికీ గుర్తింపు వచ్చేలా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన డ్రెస్‌కోడ్ అమలు చేసి జాబ్‌చార్ట్ విడుదల విడుదల చేయాలి.
- ఆర్పీలు మరణిస్తే వారి కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల బీమా సౌకర్యం ఇవ్వాలి.
- మూడు నెలలకు ఒకసారి ఈసీల తీర్మానం రద్దు చేయాలి.

‘మాలలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి’

ఆదిలాబాద్‌రూరల్: మాలలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాల సంక్షేమ సంఘం భవనం వద్ద మాలల భవిష్యత్ కార్యాచరణ, జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్, పీవీరావు, కాక చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలు ఐక్యం కావాలని ఎప్పటినుంచో నాయకులు కృషి చేస్తున్నా ఫలితం లేదన్నారు. కానీ ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ఐక్యం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జేఏసీ చైర్మన్ చన్నయ్య, కన్వీనర్ సర్వయ్య, ఓయూ జేఏసీ నాయకులు మందాల భాస్కర్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బాలరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాజేశ్వర్, స్వరూప, మేకల మల్లన్న, మధుకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

సెలవంటూ వెళ్లిపోయారు..!

- ఈ ఏడాది ప్రముఖుల అస్తమయం
- ఉమ్మడి జిల్లాలో విషాదం

2024 సంవత్సరం కష్ట సుఖాలకు నిలయమైంది. ఎన్నో మంచి కార్యక్రమాలు ఈ ఏడాది జరిగాయి. ఇదే సమయంలో కొన్ని విషాద ఘటనలూ జరిగాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు ఈ ఏడాది పరమపదించారు. గుస్సాడీ నేస్తం కనకరాజు కన్ను మూశాడు, గోండిలిపి యోధుడు అస్తమించాడు. తొలితరం రాజకీయ నేత నర్సారెడ్డి మృతి చెందాడు.

రివైండ్ 2024

నర్సన్నబాపు అస్తమయం..

నిర్మల్: నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం మలక్‌చించోలికి చెందిన పొద్దుటూరి గంగారెడ్డి ఏకైక సంతానం నర్సారెడ్డి (నర్సన్న బాపు) 1931 సెప్టెంబర్ 22న జన్మించారు. 1971 నుంచి 1972 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించారు. 1978 ఎన్నికల తర్వాత అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మంత్రివర్గంలో నీటిపారుదల శాఖ, రెవెన్యూశాఖ, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రిగా పనిచేశారు. 1967 నుంచి 1982 వరకు మూడు పర్యాయాలు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 1991లో ఆదిలాబాద్ ఎంపీగా, ఒకసారి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, నిబంధనల కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ, విజ్ఞాపనల కమిటీ, సంప్రదింపుల కమిటీల సభ్యుడిగానూ పనిచేశారు. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా ఈ ఏడాది జనవరి 29న హైదరాబాద్‌లోని తన నివాసంలోనే తుదిశ్వాస విడిచారు.

‘ఇథనాల్’ మంటలు

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు వద్దంటూ జనవరి 26న నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల రైతులు రోడ్డెక్కారు. దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, టెంబుర్నితో పాటు సమీప గ్రామాల ప్రజలు మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఆర్డీవో రత్నకల్యాణిని అడ్డుకుని వాహనంపై దాడి చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిర్మించిన ఇథనాల్ ఫ్యాక్టరీపై రైతులు దాడి చేసి, ప్రహరీగోడను కూల్చడంతో పాటు ఒక వాహనానికి నిప్పుపెట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేశారు.



ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దని ఆందోళన (ఫైల్)

- మండలంలోని రైతులు, యువకులతో పాటు మహిళలు, వృద్ధులు, చిన్నారులు సైతం ఆందోళనలో పాల్గొనడం, పరిస్థితి సీరియస్‌గా మారడంతో జిల్లా అధికారుల సమాచారం మేరకు జనవరి 27న రాష్ట్ర ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు మండల వాసులు ఆందోళన విరమించారు.

నేల రాలిన గుస్సాడీ నేస్తం!



కెరమెరి(ఆసిఫాబాద్): గుస్సాడీ అంటేనే కనక రాజుగా భావించే గుస్సాడి రాజును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 2024లో కోల్పోయింది. గుస్సాడీ కళానృత్యాన్ని తన సర్వస్వంగా భావించిన కళాప్రపూర్ణ కనక (గుస్సాడి)రాజు ఈ ఏడాది అక్టోబర్ 24న జైనూర్ మండలంలోని మార్లవాయిలో మృతి చెందాడు. 1981లో అప్పటి ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధి ఏడు నిమిషాల పాటు రాజుతో నృత్యం చేసింది. ఆమెకు నెమలి పింఛాల టోపీని తొడిగించి, కాళ్లకు గజ్జెలు కట్టి, చేతికి దుడ్డు (కర్ర) ఇచ్చిన ఏకైక వ్యక్తి కనక రాజు.

గోండి లిపిని ప్రపంచానికి తెలియజేసిన యోధుడు

నార్నూర్: గోండి లిపి ప్రతులను ప్రపంచానికి తెలియజేసిన యోధుడు కోట్నాక్ జంగు. 2014లో నార్నూర్ మండలంలోని గుంజాలలో గోండి లిపి అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయడంలో ప్రముఖుడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 పాఠశాలలను నెలకొల్పి 400 మంది విద్యార్థులకు గోండి లిపిలో విద్యాబోధన చేశారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు సహకారంతో గోండి లిపిలో 2014లో మొదటి వాచకం, 2016లో రెండో వాచకం రాశారు. 2024 సెప్టెంబర్ 23న అనారోగ్యంతో మృతి చెందాడు.



కోట్నాక్ జంగు (ఫైల్)

దారి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

గుడిహత్నూర్(బోథ్): దారి దోపిడీకి యత్నించిన కేసులో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భీమేష్ తెలిపారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. స్థానిక దుర్గా వైన్స్‌లో పనిచేస్తున్న బండి సురేష్ నిత్యం వైన్స్‌లో వచ్చిన డబ్బులతో రాత్రి కిలోమీటర్ దూరంలో ఉన్న ఇంటికి వెళ్తుండేవాడు. అది గమనించిన మండలంలోని మన్నూర్‌కు చెందిన ఘుగె రోహన్, జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌కు చెందిన సెంబెటి సాయికుమార్, హమాలీవాడకు చెందిన మీసాల అజయ్, విద్యానగర్‌కు చెందిన ఇల్లెందుల శివ ప్రసాద్ ఈ నెల 25న రాత్రి జాతీయ రహదారి 44పై సురేష్ వాహనాన్ని నిలువరించి కంట్లో కారం చల్లి డబ్బుల సంచి లాక్కునే ప్రయత్నం చేశారు. బాధితుడు ప్రతిఘటించడంతో తమతో తెచ్చుకున్న కత్తులతో గాయపరిచారు. గట్టిగా అరవడంతో పరారయ్యారు. బాధితుడు వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై మహేందర్ దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీలు, ఇతర ఆధారాల ప్రకారం పాత నేరస్తుడైన రోహన్‌పై నిఘా పెట్టగా దోపిడీకీ పాల్పడినట్లు నిర్ధారించారు. అతని కాల్‌డేటా ఆధారంగా మిగతా వారిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు స్కూటీలు, దోపిడీకి వాడిన కత్తులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా వారంతా పాత నేరస్తులుగా గుర్తించారు. రోహన్ గతంలో సుపారీ హత్య కేసులో, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్నాడు. జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం నేరాలకు పాల్పడుతున్నారని గుర్తించారు. నిందితులపై రౌడీ షీట్ తెరువనున్నట్లు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమేష్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన వడాయి బాపురావు (52) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కొండపల్లి బస్టాండ్ వద్ద గల చికెన్ సెంటర్‌లో పని చేశాడు. రాత్రి చికెన్ సెంటర్ వ్యర్థాలను ఊరి బయట పడేసి వస్తుండగా కై రిగాం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. బాపురావుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రోడ్డు ప్రమాదానికి బొలెరో కారణమని ప్రత్యక్ష సాక్షులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు వాహనం కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు సమాచారం.